## క్లుప్తంగా

### హారికపై దాడి సిగ్గుచేటు

పెనమలూరు: జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై దాడి ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి తెలిపారు. ఆమెపై దాడి జరిగిన రోజును చీకటి రోజుగా పేర్కొన్నారు. మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని కూటమి చెబుతున్న మాటలకు, వాస్తవానికి పొంతన లేదన్నారు. మహిళలపై దాడులు నిత్యకృత్యంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ మహిళను టార్గెట్ చేసి ఆమెను అంతమొందించే కుట్రకు కూటమి ప్రభుత్వం పన్నాగం పన్నిందని ధ్వజమెత్తారు. జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు నిస్సిగ్గుగా దుష్ట రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారన్నారని.. తప్పనిసరిగా తగిన మూల్యం చెల్లించుకుంటారని తెలిపారు.

### బీసీ మహిళ హారికపై దాడి అమానుషం

పెనమలూరు: టీడీపీ గూండాలు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, బీసీ మహిళ ఉప్పాల హారిక కారుపై దాడి చేయటం దారుణమని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు మండూరు కోటేశ్వరరావు తెలిపారు. గుడివాడలో నిర్వహించిన వైఎస్సార్ సీపీ కార్యక్రమంలో పాల్గొనటానికి వచ్చిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక కారును టీడీపీ గూండాలు అడ్డుకుని సభ్యసమాజం తలదించుకునే విధంగా ఆమెను దుర్భాషలాడి, కారు పై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. మహిళా సాధికారిత, మహిళల హక్కుల గురించి సీఎం చంద్రబాబునాయుడు, డీసీఎం పవన్‌కల్యాణ్ ఇంతకాలం చేసిన ప్రసంగాలు పచ్చి బూటకమని ఈ ఘటనతో తేటతెల్లమైందని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ను కంటతడి పెట్టించినందుకు బీసీలు చంద్రబాబును క్షమించరని తెలిపారు. ఊగుతూ ఉపన్యాసాలు చేసే పవన్‌కల్యాణ్ ఇప్పుడు ఎందుకు మాట్లాడటంలేదని నిలదీశారు. బీసీలను అవమానపరిచిన కూటమి పాలకుల పతనం ప్రారంభమయిందన్నారు.

### గాజుల గౌరీగా కామాక్షి అమ్మవారు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న చినకంచిలో ఆషాఢ మాసం బహుళపక్షం సందర్భంగా శనివారం శ్రీకామాక్షి అమ్మవారికి గాజుల గౌరీగా పూజలు నిర్వహించారు. వారం రోజులపాటు కామాక్షి అమ్మవారికి ప్రతి రోజూ గాజులతో అలంకారం చేసి పసుపు, కుంకుమతో పూజలు చేస్తామని దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ తెలిపారు. మొక్కుబడులున్న భక్తులు కామాక్షి అమ్మవారికి గాజులతో అలంకారం చేసి పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

### ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

గన్నవరం:స్థానిక సబ్‌జైలును శనివారం జిల్లా జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా ఛైర్మన్ జి. గోపి సందర్శించారు. సంస్థ జిల్లా కార్యదర్శి కేవీ కృష్ణయ్యతో కలిసి సబ్‌జైలులోని సదుపాయలను పరిశీలించడంతో పాటు ఖైదీలకు కల్పిస్తున్న వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా జడ్జి మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని చెప్పారు. జైలు నుంచి బయటకువచ్చిన తర్వాత సమాజంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సబ్‌కోర్టు జడ్జి డాక్టర్ ఎస్. అరుణశ్రీ, జైలు అధికారులు, సిబ్బంది, పానల్ న్యాయవాది తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తిని రక్షించిన పోలీసులు

కంకిపాడు:ఆత్మహత్యాయత్నానికి పాల్పడే వ్యక్తిని పోలీసులు రక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కంకిపాడు పట్టణానికి చెందిన అబ్దుల్ షబ్బీర్‌తాపీ కార్మికుడు. కుటుంబ సభ్యులు షబ్బీర్ మాట వినటం లేదు. దీంతో మనస్తాపానికి గురై శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. తాను పనిచేసే ముఠా మేస్త్రికి ఫోన్ ద్వారా తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. వెంటనే ముఠామేస్త్రి 112కి ఫోన్ చేసి సమాచారం అందించాడు. ఎస్ఐ డి.సందీప్ ఆదేశాల మేరకు అదనపు ఎస్ఐ తాతాచార్యులు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పట్టణంలో షబ్బీర్ ఉన్న నిర్జన ప్రదేశాన్ని గుర్తించాడు. వెంటనే పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని ఆత్మహత్యాయత్నంకు పాల్పడేందుకు సిద్ధంగా ఉన్న షబ్బీర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులను పిలిచి అప్పగించారు. సిబ్బంది చేసిన కృషిని డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ మురళీకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.

### దరఖాస్తులు ఆహ్వానం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.సంధ్య మాధురి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సంస్కృతం పోస్ట్ ఖాళీగా ఉందని తెలిపారు. సంస్కృతంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం పైన మార్కులు సాధించిన వారు అర్హులు. అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు కళాశాల కార్యాలయంలో అందజేయాలన్నారు.

# హైలెవల్ బ్రిడ్జి నిర్మాణమయ్యేనా?

- ఏడేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన టీడీపీ ప్రభుత్వం
- మరలా హడావుడి చేస్తున్న వైనం
- ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్





శంకుస్థాపన చేసిన శిలాఫలకం (ఇన్‌సెట్)
వంతెన నిర్మాణానికి ప్రతిపాదన చేసిన స్థలం

పెనమలూరు: పోరంకి వద్ద బందరు కాలువ పై హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణం కోసం గత టీడీపీ పాలనలో శంకుస్థాపన చేసి వదిలేశారు. మరలా కూటమి పాలన వచ్చిన ఏడాది తరువాత హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణం చేస్తామని తెరపైకి ప్రతిపాదన తీసుకొచ్చారు. గత అనుభవం దృష్ట్యా అసలు హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణం చేస్తారా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోరంకి విజ్ఞాన్ భారతిత్ స్కూల్ రోడ్డు చివరిలో బందరు కాలువ పై హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణం చేసేందుకు 2018లో అప్పటి రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రస్తుత స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శంకుస్థాపన చేశారు. హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణం రూ.30 కోట్లతో చేపడతామని టీడీపీ నేతలు స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. తాడిగడప–పోరంకి గ్రామాలకు రాకపోకలకు అనుసందానం చేస్తామని చెప్పారు. అయితే శంకుస్థాపన హడావుడిగా చేసినా ఆ తరువాత హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణం చేయలేదు. దీంతో హైలెవల్ బ్రిడ్జ్ శంకుస్థాపన శిలాఫలకానికే పరిమితమయి పోయింది.

**కూటమి పాలనలో...**

కూటమి పాలన మరలా అధికారంలోకి వచ్చిన ఏడాది తరువాత హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణం మరల తెరపైకి వచ్చింది. గత కొద్ది రోజుల క్రితం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వచ్చి హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణం చేయటానికి ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. వంతెన నిర్మాణానికి అంచనాలు వేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పుడు పెరిగిన మెటీరియల్ ధరలకు హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణానికి రూ.కోటి పైనే నిధులు ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉంటుంది. మరి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా ఉంది.

**యనమలకుదురు వంతెనను నీరు కార్చారు..**

గతంలో యనమలకుదురు గ్రామంలో బందరు కాలువ పై నిర్మాణం చేసిన వంతెనను గత టీడీపీ పాలనలో నీరుకార్చారు. ఈ వంతెన నిర్మాణానికి అనేక సాకులు చూపారు. తీరా వంతెన నిర్మాణం చేపట్టిన తరువాత కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వలేదు. దీంతో ఈ వ్యవహారం కోర్టుకు వెళ్లింది. కాంట్రాక్టర్ యనమలకుదురు వంతెన నిర్మాణం కొంత చేసి పనులు వదిలేశాడు. దీంతో ట్రాఫిక్ సమస్యలతో గ్రామ ప్రజలు నరకం చేశారు. వైఎస్సార్ సీపీ పాలనలో వంతెనకు తాత్కాలిక అప్రోచ్‌లు వేసి రాకపోకలకు అనువుగా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతైనా కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వలేదు. కూటమి నేతలు కాంట్రాక్టర్‌తో సంబంధం లేకుండా వంతెన ప్లాన్‌కు విరుద్ధంగా తాత్కాలిక పనులు చేశారు. ప్రస్తుతం వంతెనను గ్రామస్తులు ఉపయోగిస్తున్నారు.

**పేదల ఇళ్లు కోల్పోవాల్సిందే...**

పోరంకి వద్ద బందరు కాలు పై ప్రతిపాదన చేసిన హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణం ఎవరి కోసం అనే ప్రశ్నతలెత్తుతుంది. బందరు కాలువ అవతలి పక్కన ప్రముఖ కంటి ఆస్పత్రి ఉండటంతో ఆస్పత్రి కోసం ప్రభుత్వం నిధులు ఖర్చు చేసి హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణం చేయటానికి రెండవ సారి ప్రతిపాదనతో ముందుకు వచ్చింది. ఆస్పత్రి నిర్వాహకులు, ప్రభుత్వ పెద్దలకు ఉన్న సంబంధాల కారణంగానే కదలిక వచ్చిందని చెబుతున్నారు. ఈ బ్రిడ్జ్ నిర్మిస్తే ప్రజలకంటే ఆస్పత్రి యాజమాన్యానికే ఎక్కువ లాభం చేకూరుతుంది. ఆస్పత్రిలో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తే ప్రభుత్వ నిధులతో బ్రిడ్జ్ నిర్మాణానికి ఖర్చు చేస్తే ఎటువంటి ఆక్షేపణ ఉండదు. భవిష్యత్తులో ఆస్పత్రిలో ఉచిత సేవలు అందిస్తారా లేదా అనేది ప్రభుత్వం తేల్చాల్సి ఉంది. పైగా ఈ ప్రాంతంలో వంతెన నిర్మిస్తే కాలువ కట్టల పై ఉన్న నిరుపేద ఇళ్లను తొలగించాల్సి ఉంది. మరి పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఎక్కడ ఇస్తారో అధికారులు ప్రకటించాలి. అలాగే ఈ వంతెన నిర్మాణం కనుక జరిగితే పోరంకి సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తుతుంది. దీని పరిష్కార మార్గాల పై చర్యలు తీసుకోవల్సి ఉంటుంది. ఏది ఏమైన హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణం పై తుది నిర్ణయం ప్రభుత్వానిదే. వంతెనకు నిధులు మంజూరు చేస్తారా లేదా అని వేచి చూడాల్సి ఉంది.

### నేడు ఈడుపుగల్లులో ఉచిత మెగా వైద్య శిబిరం

కంకిపాడు: మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో ఈ నెల 13న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ పి.ఇందిర తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. విజయవాడకు చెందిన పూర్ణ హార్ట్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పంచాయతీ కార్యాలయంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తారన్నారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### నేడు ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడులో ఆదివారం ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైస్ ఎంపీపీ చందు రమాదేవి, వైఎస్సార్ సీపీ నేత చందు శ్రీనివాసరావు దంపతులు తెలిపారు. గ్రామంలోని ఆర్సీఎం పాఠశాల ప్రాంగణంలో మెగా నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శంకర్ నేత్ర చికిత్సాలయానికి చెందిన ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు శిబిరంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. కోడూరుపాడు పరిసర గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వృద్ధ దంపతులకు టిఫిన్ స్టాల్ బహూకరణ



యనమలకుదురులో టిఫిన్ స్టాల్ అందజేస్తున్న సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి

పెనమలూరు:యనమలకుదురు గ్రామంలో వృద్ధ దంపతులకు వైఎస్సార్ సీపీ స్టీల్ టిఫిన్ స్టాల్ బహూకరించింది. గ్రామంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ జాయింట్ సెక్రెటరీ అష్రఫ్ అహ్మద్ సహకారంతో పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ దేవభక్తుని చక్రవర్తి హైదర్ మసీదు వద్ద స్టాల్ బహూకరించి ప్రారంభించారు. పేద వృద్ధ దంపతులకు ఉపాధి అవకాశం కోసం పార్టీ నుంచి సాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు వేమూరి బాలకృష్ణ, నేతలు చాంద్‌బాషా, ఫణి, కత్తెరబాషా, లతీఫ్, గుమ్మడి నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, కొండారెడ్డి, రెహమాన్, హఫీజ్, ఇమ్రాన్‌రాజా, పలువురు పాల్గొన్నారు.

## టీడీపీలో భగ్గుమన్న వర్గ విభేదాలు



కేసరపల్లిలో నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు



పొట్లూరితో చర్చలు జరుపుతున్న ఎస్ఐ శ్రీధర్

కేసరపల్లి(గన్నవరం):మండలంలోని కేసరపల్లిలో శనివారం జరిగిన సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో టీడీపీలోని వర్గ విబేదాలు భగ్గుమన్నాయి. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్న ఈ కార్యక్రమానికి టీడీపీలోని సీనియర్ వర్గాన్ని పూర్తిగా దూరం పెట్టారు. ఈ విషయమై కొంత మంది ఎమ్మెల్యేను నిలదీస్తారనే సమాచారం మేరకు పోలీసులతో గృహ నిర్బంధాలు చేయించారు. సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే యార్లగడ్డ సూచనల మేరకు గ్రామ పార్టీ అధ్యక్షులు వలగాని బాలకృష్ణతో పాటు పలువురు సీనియర్లను ఆహ్వానించలేదు. ఈ విషయమై గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను ప్రశ్నించాలని తొలుత గ్రామ పార్టీ కార్యవర్గం సిద్ధమైంది. పార్టీ కష్టాలో ఉన్నప్పుడు జెండా పట్టుకుని నిలబడ్డాం, గత ఎన్నికల్లో యార్లగడ్డ విజయానికి రేయింబవళ్లు శ్రమించాం. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత తమ పట్ల చిన్నచూపు చూస్తు కనీసం పార్టీ కార్యక్రమాలకు కూడా పిలవడం లేదన్నారు. తమకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించాలనుకున్న తమపై పోలీసులతో బెదిరింపులు, నిర్బంధాలకు పాల్పడటం దారుణమన్నారు. యార్లగడ్డ తన వైఖరి మార్చుకుని అందరినీ కలుపుకు వెళ్లాలని బాలకృష్ణ హితవు పలికారు. అనంతరం వీరంతా ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు వద్దకు వచ్చి తమ బాధను విన్నవించుకున్నారు. ఎస్ఐ శ్రీధర్ బసవరావుతో చర్చలు జరిపి గొడవలు జరగకుండా సహకరించాలని కోరారు.

## అంగన్‌వాడీలపై యాప్‌ల భారం తొలగించాలి

ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ఉయ్యూరు: అంగన్‌వాడీలపై యాప్‌ల భారం తొలగించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉయ్యూరు పట్టణంలోని సీఐటీయూ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావమ్మ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై గంటకో యాప్‌ను రూపొందించి కార్యకర్తలను తీవ్ర మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని తెలిపారు. పాలకులు, అధికారుల ఒత్తిడితో కార్యకర్తలు గుండె జబ్బుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు అందిస్తున్న సేవలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం సమన్వయం చేయటం పరిపాటి కానీ ప్రతి విషయానికి యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలని వేధించటం సరికాదన్నారు. కొన్ని ప్రాంతాల్లో సిగ్నల్స్ లేక అంగన్‌వాడీ కార్యకర్తలు అవస్థలు పడుతున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. స్థానికంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించలేని గుడ్డి ప్రభుత్వాలు అధిక భారాలు మోపి వారిని మరింత అప్పుల ఊబిలోకి దించుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో నిత్యావసర సరుకులు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అరకొర మెనూ చార్జీలు అమలు చేస్తూ వాటిని సైతం నెలలు తరబడి ఇవ్వకపోవడంతో నెలకు సుమారు మూడువేల రూపాయలు అంగన్‌వాడీ కార్యకర్తలు అప్పులు చేసి మరి చిన్నారుల కోసం ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. స్కీమ్ వర్కర్ల పేరుతో కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలను దగా చేస్తుందని ధ్వజమెత్తారు. ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాంచారమ్మ, రమాదేవి, సీఐటీయూ జిల్లా నాయకులు బూర సుబ్రహ్మణ్యం, జిల్లా నాయకులు రజీనా రాణి, లక్ష్మీ, సువర్ణలత, లక్ష్మీప్రసన్న, రమాదేవి, వాణి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో ఇష్టారాజ్యం!

- పేదలను ఇబ్బందులకు గురిచేస్తూ కాలువ తవ్వకం
- ఈడుపుగల్లులో వింతచేష్టలతో అధికార పక్ష నేతలు, అధికారులు



కాలువ గట్టును తవ్వేస్తున్న పొక్లెయినర్

కంకిపాడు: కూటమి పాలన ఇష్టారాజ్యంగా తయారైంది. మమ్మల్ని ఎవడు అడిగేది అన్న ధైర్యంతో అధికారం మాటున అధికార పక్షం రెచ్చిపోతోంది. అధికారులను పావులుగా వాడుకుంటూ తమను నచ్చినట్లు వ్యవహరిస్తోంది. ఇందుకు ఈడుపుగల్లు గ్రామంలో శనివారం చోటుచేసుకున్న పంట కాలువ తవ్వకం పనులే ఉదాహరణ. కాలువ తవ్వకం పనులు సంబంధిత అధికారులకు ఎవరికీ పూర్తి స్థాయిలో తెలియకపోవటం విడ్డూరం.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కేటాయించింది. ఇందులో భాగంగానే ఈడుపుగల్లులోని చింతల తోటలో సుమారు 40 మందికి నివేశన స్థలాలు కేటాయించింది. ఈడుపుగల్లు–ఉప్పులూరు ప్రధాన రహదారి వెంబడి పంట కాలువ ఒడ్డున కొందరు తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నారు. రోడ్డు నుంచి కాలువ మీదుగా ఇళ్లల్లోకి వెళ్లేందుకు సిమెంటు స్తంభాలను ఏర్పాటుచేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

**పంట కాలువ రూట్ ఎందుకు మారింది?**

పంట కాలువల తవ్వకం పనుల్లో భాగంగా కంకిపాడు సెక్షన్ పరిధిలోని సిబ్బంది పొక్లెయినర్‌తో ఈడుపుగల్లు జగనన్న లే అవుట్ ఎదురుగా ఉన్న పంట కాలువ తవ్వకం పనులు చేపట్టింది. అయితే ప్రస్తుతం పారుదల అవుతున్న రూట్ మార్చేశారు. కాలువ అవతలి వైపున ఉన్న గట్టును పూర్తిగా తవ్వేసి కాలువను పూడ్చివేశారు. గట్టు ఉన్న ప్రదేశం గుండా కాలువ పారేలా ఏర్పాట్లు చేశారు. ఈ చర్యతో ఇక్కడి నివాసితులు తమ ఇళ్లకు ఏర్పాటుచేసుకున్న బరంతును ధ్వంసం చేసేశారు. రాకపోకలకు వీలుగా ఏర్పాటుచేసుకున్న స్తంభాలను తొలగించారు. కాలనీ ఇళ్లకు పంటకాలువకు మధ్యన గ ట్టు అనేదిలేకుండా అస్తవ్యస్తంగా, ఇష్టారాజ్యంగా పనులు పూర్తి చేశారు. ఇందుకు అధికార పార్టీకి చెందిన కొందరు నేతల హస్తం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ నివసిస్తున్న పేదల జీవనాన్ని చూసి ఓర్వలేకే కాలువ తవ్వకం పనులు పేరుతో అరాచకంగా వ్యవహరించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఇది మరీ విడ్డూరం...**

కాలువ రూటు మార్పు వ్యవహారంపై పనుల పర్యవేక్షణకు వచ్చిన ఇరిగేషన్ సిబ్బందిని ప్రశ్నించగా ఈడుపుగల్లు రోడ్డును విస్తరించనున్నారని, విస్తరణకు కాలువ అడ్డుగా ఉంటుందనే కారణంతో ముందస్తు చర్యల్లో భాగంగా కాలువ రూటు మారుస్తున్నామని చెప్పుకొచ్చారు. కానీ ఈడుపుగల్లు ప్రధాన రహదారి సింగిల్ లైన్‌గా అభివృద్ధి చేసేందుకు రూ 3.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో త్వరలో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలవనున్నారు. ఈ తరుణంలో రోడ్డు విస్తరణ సాకుతో కాలువను ధ్వంసం చేసి పేదలను ఇబ్బందులకు గురిచేయటం గమనార్హం.

**కాలువను బాగుచేయమన్నాం**

పంట కాలువ బాగుచేయమని సూచించాము. కాలువలు పూడుకుపోయి రైతులకు సాగునీరు ఇబ్బంది అవుతుంది. అంతేకానీ కాలువ గట్టు తవ్వకం, కాలువ రూటు మార్చటం నాకు తెలీదు. సరైన సమాచారం నా దగ్గర లేదు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. ఏం జరిగిందో విచారిస్తాం.

– నాగబాబు, ఏఈ, ఇరిగేషన్ సెక్షన్, కంకిపాడు

**రోడ్డు విస్తరణ లేదు**

ఈడుపుగల్లు రోడ్డు విస్తరణ లేదు. కేవలం సింగిల్ లైన్ పనులే జరగనున్నాయి. రూ.3.50 కోట్లు నిధులు కేటాయించారు. వచ్చే వారంలో టెండర్లు పిలుస్తారు. రోడ్డు విస్తరణ ప్రతిపాదన అంశం మా దృష్టిలో లేదు. ఎందుకు రోడ్డు విస్తరణ అంశాన్ని ప్రస్తావించారో?, ఎవరు పనులు చేయిస్తున్నారో తెలీదు.


– మల్లికార్జున, ఏఈ, ఆర్అండ్‌బి, కంకిపాడు

### 18న శాకంబరీ దేవి అలంకరణ


రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈ నెల 18న ఆషాఢమాసం బహుళ అష్టమిని పురస్కరించుకుని అమ్మవారికి ప్రీతికరమైన శ్రీ శాకంబరీ దేవి అలంకారం నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి పి. ప్రియాంక తెలిపారు. ఈ అలంకారం నిమిత్తం అమ్మవారి భక్తులు సమర్పించదలచుకున్న కూరగాయలు, పండ్లను ఈ నెల 17 ఉదయం 10 గంటలలోపు అందజేయాలని సూచించారు. అలంకరణకు సహకరించిన భక్తుల పేర్లు దేవస్థానం నోటీసు బోర్డులో ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకోవాలని కోరారు.

# శిథిలావస్థలో ఏలూరు కాలువ వంతెన

- వందేళ్ల కిందట నిర్మాణం
- ఎన్నో గ్రామాలకు రాకపోకలు
- భారీ వాహనాలతో పొంచి ఉన్న ప్రమాదం



బీటలు వారుతున్న వంతెన గోడ



వంతెన గోడలపై మొలిచిన మొక్కలు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో ఏలూరు కాలువపై బ్రిటీషు పాలకుల కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. దశాబ్దాలుగా ఈ వంతెన కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవడం కారణంగా కూలిపోయే స్థితికి చేరుకుంది. వంతెనపై రెయిలింగ్ దెబ్బతినడంతో పాటు పిచ్చిమొక్కలు మొలిచి గోడలు బీటలవారాయి. దీనికితోడు పరిమితికి మించిన లోడుతో భారీ వాహనాలు వంతెనపై రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. సుమారు వందేళ్ల క్రితం గానుగసున్నం, రాతిరాయితో ఈ వంతెనను నిర్మించారు. కేసరపల్లి వద్ద జాతీయ రహదారి బైపాస్ నిర్మించక ముందు విజయవాడ–ఏలూరు మధ్య వాహనాలు ఈ వంతెన మీదుగానే రాకపోకలు సాగించేవి. ప్రస్తుతం గన్నవరం నుంచి కేసరపల్లి మీదుగా ఉప్పులూరు, తెన్నేరు, మంతెన, పునాదిపాడు, కంకిపాడు వెళ్లేందుకు ఈ వంతెన ఉపయోగపడుతుంది. అంతే కాకుండా కేసరపల్లి రైతులు ఏలూరు కాలువ అవతల పంట పొలాలకు వెళ్లేందుకు, పండించిన పంటలను గ్రామానికి తీసుకొచ్చేందుకు ఈ వంతెన ప్రధాన ఆధారం. గతంలో కృష్ణానది పుష్కరాల సమయంలో కంకిపాడు–కేసరపల్లి మధ్య ఆర్అండ్‌బీ రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరించిన ప్రభుత్వం వంతెన నిర్మాణాన్ని మాత్రం విస్మరించింది.

**భయం...భయంగా ప్రయాణం....**

శతాబ్ద కాలం క్రితం నిర్మించిన ఈ వంతెనపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. సుమారు 30 నుంచి 40 టన్నుల సామర్థ్యం కలిగిన ఇసుక, గ్రావెల్ టిప్పర్లు, ధాన్యం లోడు లారీలు కూడా ఈ వంతెనపై వెళ్తున్నాయి. దీంతో పునాదులు బలహీనపడుతుండడంతో పాటు వంతెన గోడలు కూడా క్రమంగా దెబ్బతింటున్నాయి. ఆర్అండ్‌బీ శాఖ కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడం కారణంగా వంతెన క్రమంగా దెబ్బతింటుంది. వంతెన గొడలకు, రెయిలింగ్‌పై పిచ్చి మొక్కలు మొలిచి అధ్వానంగా తయారైంది. ఇరుకుగా ఉండే ఈ వంతెనపై ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పుకుని వెళ్లే పరిస్థితి కూడా లేదు. శిథిలావస్థకు చేరుకున్న వంతెన ఏక్షణంలో కూలుతుందోననే భయంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. పాత వంతెన స్థానంలో కొత్తది నిర్మించాలని పలుమార్లు ప్రభుత్వాలకు విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ పట్టించుకున్న నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి వంతెన పునర్నిర్మాణం దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ప్రతిపాదనలు పంపించాం**

గతంతో పోల్చితే ఈ వంతెనపై వాహనాల రద్దీ గణనీయంగా పెరిగింది. అందుకు అనుగుణంగా సుమారు రూ. 35 కోట్లతో కొత్త వంతెన నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వం ద్వారా నాబార్డుకు పంపించాం. ఇంకా నిధులు మంజూరు కావాల్సి ఉంది.

– శ్రీహరి, ఆర్అండ్‌బీ ఏఈ, గన్నవరం

### ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై వర్క్‌షాపు



హనుమాన్‌జంక్షన్ రూరల్: ఫొటోగ్రఫీ రంగంలో రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నైపుణ్యత పెంపొందించుకున్నప్పుడే పోటీ వ్యవస్థలో మనుగడ సాధించగలమని హనుమాన్ జంక్షన్ ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చక్రపాణి విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక విజయవాడరోడ్డులోని లయన్స్ క్లబ్ హాల్లో సోనీ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటోగ్రాఫర్ల వర్క్‌షాప్‌ను సీనియర్ ఫొటోగ్రాఫర్ తాడి రంగారావు ప్రారంభించారు. సోనీ కంపెనీ ఆర్ఎస్ఓ చైతన్య మెలకువలు, ఆధునిక పరికరాల వినియోగంపై అవగాహన కల్పించారు. అసోసియేషన్ కోశాధికారి గంటా శ్రీనివాస్, సభ్యులు కళ్లేపల్లి నారాయణరావు, అంబళ్ల వెంకట రంగారావు, వాసు ప్రసాద్, చిన్ని, ప్రభాకర్, మహేష్, జోజి, మురళీ పాల్గొన్నారు.